అంతా రామనామస్మరణమే..

కేపీహెచ్‌బీ కాలనీలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అయోధ్యలో శ్రీరామచంద్ర భగవానుడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం గ్రేటర్ హైదరాబాద్ నగర సంఘం, గ్రేటర్ నగర యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని అంజయ్యనగర్ నుంచి కొత్తగూడ, కొండాపూర్‌ల మీదుగా జగద్గిరిగుట్ట వరకు చేపట్టిన శోభాయాత్ర – కొండాపూర్, జనవరి 22

మారుమోగిన వాడలు.. వీధుల్లో కాషాయతోరణాలు
బైక్‌ర్యాలీలు.. అన్నదాన కార్యక్రమాలు
భక్తిపారవశ్యంలో ప్రజలు

అయోధ్యలోని భవ్య రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో సోమవారం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో ప్రజలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీధులలో కాషాయ తోరణాలు కట్టి బాణాసంచా కాలుస్తూ జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. శోభాయాత్రలు, ద్విచక్ర వాహనయాత్రలతో వేడుకలను నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజవర్గంలోని వివిధ ఆలయాల్లో ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతర ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గమంతా రామమయం అయిందని, సంబురాలు వేడుకలు అంబరాన్నంటాయన్నారు. రాముల వారి అనుగ్రహం నియోజకవర్గంలోని ప్రజలందరిపైనా ఉండాలని ఎమ్మెల్యే గాంధీ ఆకాంక్షించారు. రామారావునగర్ హనుమాన్ అలయంలో నిర్వహించిన వేడుల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూజలు నిర్వహించారు.

– కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, జనవరి 22


బాలాజీనగర్‌లో మహవీర్ భక్తమండలి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్, తదితరులు

కూకట్‌పల్లి డివిజన్‌లోని ఆలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో సీతారాముల ఉత్సవ మూర్తుల శోభాయాత్రలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

నిజాంపేట్ అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, తదితరులు

శివరాంజనేయ దేవాలయంలో సీతారాముల కల్యాణమహోత్సవంలో భక్తులు

డిప్యూటీ సీఎం భట్టికి శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సాదామహేశ్, కర్క చిన్నసాయి, జక్కుల అశోక్ లు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ

హామీలను అమలు చేయాలి

మియాపూర్, జనవరి 22 : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాష్ట్ర గిరిజన సంఘం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి తాసీల్దార్‌కు సంఘం ప్రతినిధులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారాం నాయక్ మాట్లాడుతూ.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ, పంటకు పెట్టుబడి సాయం, పండిన పంటకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల చెల్లింపు, ధరణి లోపాల సవరణ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఈ సారి సరిపడా వర్షాలు..
చిత్తారమ్మదేవి ఉత్సవాల్లో భవిష్యవాణి వినిపించిన రాజేశ్

దుండిగల్,జనవరి22: ఈ ఏడాదితో కరోనా మహమ్మారి పీడవిరగడవుతుందని చిత్తారమ్మదేవి భవిష్యవాణిలో పేర్కొంది. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన గాజులరామారం చిత్తారమ్మజాతర(బ్రహ్మోత్సవాలు)లో భాగంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం 'రంగం'కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే 'రాజేశ్' అమ్మవారి తరపున భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాదిసైతం వర్షాలు అధికంగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొంది. ఈ వేడుకల్లో ఆలయకమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, సభ్యులు అముర ఇంద్రసేనాగుప్త, ఆర్.బాలరాజు, ఎం.పెంటారెడ్డి, జీ.నర్సింహ, ఆర్.నర్సింహ, ఆర్.సత్తయ్య, డీ.ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిత్తారమ్మదేవి ఆలయ ప్రాంగణంలో భవిష్యవాణి వినిపిస్తున్న రాజేశ్

చిల్డ్రన్ పార్కులో వాహనాలను తొలగించాలి

జీడిమెట్ల, జనవరి 22 : సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలో ఉన్న పండిత్ జవహర్ లాల్ నెహ్రూ చిల్డ్రన్ పార్కులో పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని పార్కు అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులకు, సూరారం పోలీస్‌స్టేషన్ అధికారులకు వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ పార్కు అసోసియేషన్ సభ్యులు ప్యాట నరేంద్ర, విఠల్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామివారి ఊరేగింపు

అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం, బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ సముదాయంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించిన అనంతరం స్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండుగగా సాగింది.

– కొండాపూర్, జనవరి 22

మైనార్టీ గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య

హైదర్‌నగర్‌లోని శేరిలింగంపల్లి మండల మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలపై అవగాహనకు రూపొందించిన గోడ పత్రికను కార్పొరేటర్ రోజాదేవితో కలిసి ఎమ్మెల్యే గాంధీ సోమవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వ తరగతిలో మైనార్టీ, నాన్ మైనార్టీతో పాటు 6, 7 తరగతులలో మైనార్టీ విద్యార్థులకు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మైనార్టీ గురుకుల సంక్షేమ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఈ కార్యక్రమంలో రంగారావు, ప్రిన్సిపాల్ చందర్‌రెడ్డి, రామరాజు, సత్యనారాయణ, నర్సారెడ్డి, ఆశ్ర బానో, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. – మియాపూర్, జనవరి 22

నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్డు పక్కన వేయొద్దు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తే భారీగా జరిమానా చెల్లించాల్సి వస్తుందని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం జోన్ ఆఫీస్‌లో బిల్డర్స్ అసోసియేషన్, ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అసోసియేషన్, రామ్‌కీ ప్రతినిధులు ఆయా సర్కిళ్ల ఆయా ఉప కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం, ఏఎంహెచ్‌వో లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ గుర్తించిన ప్రాంతాల్లోనే నిర్మాణ వ్యర్థాలను పారబోయాలని కోరారు.

కూకట్‌పల్లి జోన్‌లో ప్రజావాణికి 17 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : కూకట్‌పల్లి జోనల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో 17 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ అభిలాష తెలిపారు. సోమవారం కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. జోన్ పరిధిలోని మూసాపేట సర్కిల్‌లో 0, కూకట్‌పల్లి సర్కిల్‌లో 0, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 0, గాజులరామారం సర్కిల్‌లో 8, అల్వాల్ సర్కిల్‌లో 6, కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో 3 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు.

ఫిర్యాదుల వెల్లువ

కుత్బుల్లాపూర్,జనవరి22: త్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రతి సోమవారం చేపట్టే ప్రజావాణి కార్యక్రమంలో పలు సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్‌లో-1, టౌన్‌ప్లానింగ్-2, యూబీడీ-1, ఎలక్ట్రికల్-1, షానిటేషన్-1లో చొప్పున ఫిర్యాదులు అందినట్లు డీసీ మల్లారెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన శూన్యం..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని డీసీలు రమేశ్, కృష్ణయ్యలు తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాగా.. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు పడిగాపులు కాచినా ఒక్కరు కూడా ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేదు. ప్రజల కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

గిరినగర్‌లో ఉచితవైద్యశిబిరం

జగద్గిరిగుట్ట, జనవరి3: పేదలకు ఉపయోగపడేలా ఉచితవైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని నేతలు న్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌లో సోమవారం యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యబిరాన్ని యువనేస్తం అధ్యక్షుడు కేపీ విశాల్ ప్రారంభించారు, బస్తీవాసులకు వైద్యనిపుణులు లక్ష్మి, వాసవి, షఫియా, ప్రశాంత్, రోహిత్, చిన్మయి పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేశారు. నిర్వాహకులు సల్మాన్, నసీరుద్దీన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కుత్బుల్లాపూర్,జనవరి22: ప్రతి ఒక్కరు వాహనాలు నడిపే సమయంలో సూచించబడిన రోడ్డు, ట్రాఫిక్ ఇతర నిబంధనలను పాటించి సురక్షితమైన ప్రయాణాలను కొనసాగించాలని మేడ్చల్ రవాణా శాఖ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రాజా సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం పేట్ బషీరాబాద్‌లో ప్రత్యేకంగా ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జి.రవికుమార్ త్రివేణి, మహేశ్, గంగాధర్, జి.మహేశ్, ఎల్.త్రివేంబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, జనవరి 22 : 11 కేవీ ఆర్‌పీ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం రామారావు నగర్, మాధవరం కాలనీ, దీన బంధు కాలనీ, హనుమాన్‌నగర్, ప్రగతీనగర్, రామకృష్ణనగర్, ఆర్‌పీ కాలనీలలో మంగళవారం ఉదయం 10.30-12.30 వరకు , వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో కమల ప్రసన్ననగర్, ఆల్విన్ కాలనీ , సాయినగర్ ఈస్ట్ అండ్ వెస్ట్, రాఘవేంద్రనగర్, సాయి కల్యాణ మంటపం, జయశంకర్‌నగర్ ,,విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీ, శుభోదయ కాలనీ, వెంకటేశ్వరనగర్, ఆల్విన్ కాలనీ ఫేజ్ 2, వీకర్ సెక్షన్, దీన బంధు కాలనీలో కొంత ప్రాంతాలో మద్యాహ్నం 2.30-4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ శరత్ బాబు సోమవారం తెలిపారు.

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా..

కుత్బుల్లాపూర్ కృతజ్ఞత యాత్రలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,జనవరి22: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేపట్టిన ప్రజల కృతజ్ఞత యాత్ర సోమవారం 10వ రోజు కుత్బుల్లాపూర్ 131 డివిజన్‌లోదత్తాత్రేయనగర్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజల నుంచి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు విశేష ఆదరణ లభించింది. మహిళలు ప్రత్యేకంగా ఎమ్మెల్యేకు మంగళహారతులు, పువ్వులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాముడి చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. అభ్యర్థిగా నన్ను ప్రకటించిన నాటి నుంచి నా వెంటే ఉండి నాకు ఇంతటి అఖండ విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్‌లో కృతజ్ఞతయాత్రలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్, తదితరులు

- కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేస్-2 రింగ్‌రోడ్డులో ఇటీవల నిర్మించిన క్రిస్టియన్ గ్రేవ్‌యార్డును ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రేవ్‌యార్డులో మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యద ర్శి సత్తిరెడ్డి, పాస్టర్లు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా ..

జీడిమెట్ల, జనవరి 22 : పరిశ్రమలలో అన్యాయం జరిగిన కార్మికులకు తాను అండగా ఉంటానని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడ కెమిక్ లైఫ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పని చేసిన కార్మికుడు సర్వేశ్వర రావుకు నెల వేతనం రూ.16500 పరిశ్రమ యజమాన్యంతో మాట్లాడి సోమవారం ఇప్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ చారి, మనోజ్‌కుమార్, అనిల్ కుమార్, సుదర్శన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లంపేట్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

దుండిగల్,జనవరి22: దుండిగల్ మున్సిపాలిటీని అన్నిరంగాలల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు మల్లంపేట్‌లో రూ.10లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు స్థానిక కౌన్సిలర్ శామీర్‌పేట్ సంధ్యతో కలిసి వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు, కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

భూగర్భడ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్లు శంభీపూర్‌కృష్ణ, శామీర్‌పేట్ సంధ్య, తదితరులు

పెండింగ్ పనులను పూర్తి చేయాలి
ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 22 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో గతంలో శంకుస్థాపన చేసిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్, మేయర్, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్ లను కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా ఇప్పటికే శంకుస్థాపన చేసిన పనులను పూర్తి చేయాలని.. ఆయా సమస్యల పరిష్కారం కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. కూకట్‌పల్లి రంగధాముని (ఐడీఎల్) చెరువు నాలా నుంచి కూకట్‌పల్లి బస్‌డిపో వరకు నాలా విస్తరణ, రిటర్నింగ్ వాల్ పనులను చేపట్టాలని, రాబోయే వర్షాకాలంలో సమీపంలోని కాలనీలు, బస్తీల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫతేనగర్ డివిజన్‌లో ప్రభాకర్ రెడ్డి నగర్ నుంచి ఫతేనగర్ వరకు మురుగు నీటి నాలా విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులను కేటాయించాలని.. పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు.

జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం

బిక్యానాయక్(ఫైల్)

దుండిగల్,జనవరి22: మతిస్థిమితంలేని యువకుడు అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం డివిజన్ పరిధిలోని శివాలయనగర్‌కు చెందిన బానోత్ రత్ని, చందర్ దంపతులకు బిక్యానాయక్(25) కొడుకు ఉన్నాడు. బిక్యానాయక్ మతిస్థిమితంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల18న ఉదయం దంపతులు ఇద్దరు పనులకు పోగా బిక్యానాయక్ ఇంటివద్దనే ఉన్నాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో తల్లి రత్ని ఇంటికి రాగా కొడుకు కనిపించలేదు. ఈ మేరకు సోమవా రం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థి అదృశ్యం

సందీప్ (ఫైల్

జీడిమెట్ల, జనవరి 22 : కాలేజీకి వెళ్లిన విద్యార్థి తిరిగి రాలేదు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అపురూపకాలనీకి చెందిన శర్మ కుమారుడు సందీప్(16) చింతల్‌లోని భాగ్యరథీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రోజు మాదిరిగానే కాలేజీకి అని వెళ్లి తిరిగి రాలేదు. మొత్తం గాలించినా ఆచూకీలభించకపోవడంతోపోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ షెడ్ కూల్చివేత

మియాపూర్, జనవరి 22 : శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్ డివిజన్ సర్వే నంబరు 11-27లో అక్రమంగా నిర్మించిన షెడ్‌ను కూల్చివేసినట్లు జడ్సీ స్నేహ శబరీష్ తన ట్విటర్ ఖాతా ద్వారా షేర్ చేశారు. అనుమతుల్లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జోన్ పరిధిలో పలు చోట్ల దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లకు మరమ్మతులను చేసి పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.